నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, గురువారం 16 మే 2024 VIKARABAD

## ఫిట్‌నెస్ ఉంటేనే.. బడికి బస్సులు

సిటీబ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ) : విద్యాసంస్థల బస్సులపై ఆర్టీఏ అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే నగరంలో అడ్మిషన్ల ప్రక్రి య జోరందుకోవడంతో స్కూల్, కాలేజీ బస్సులు ప్రచారం కోసం రోడ్డెక్కుతున్నాయి. జూన్ ప్రారంభంలో ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రారంభం కానుండటంతో రవాణా శాఖ అధికారులు బస్సుల ఫిట్‌నెస్‌పై యాజమాన్యాలకు సూచనలు చేస్తున్నారు. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రవాణా శాఖ పరిధిలో 11,834 విద్యాసంస్థల బస్సులు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే 70 శాతం బస్సులు ఫిట్‌నెస్ రెన్యూవల్ చేసుకున్నాయని ఉన్నతాధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులను నడిపితే యాజమాన్యాలపై కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. ఐదు రకాల వాహనాల వేగానికి కళ్లెం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో విద్యాసంస్థల బస్సులు కూడా ఉన్నాయి. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), వ్యాలిడ్ ఇన్స్యూరెన్స్ సర్టిఫికెట్, వ్యాలిడ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పర్మిట్, ట్యాక్స్ పేమెంట్ రసీదు (బకాయిలు లేకుండా), పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్, డ్రైవింగ్ చేసే డ్రైవర్ లైసెన్సు తప్పక వాహనంతో ఉండాలని తెలిపారు.



## ఇంటర్ సప్లిమెంటరీ..

# ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి

- మెరుగైన ఫలితాలు సాధించేలా ఇంటర్ బోర్డు చర్యలు
- ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక తరగతులు
- ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకులతో కొనసాగుతున్న ఆన్‌లైన్ బోధన
- ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రథమ స్థానం, సెకండియర్‌లో తృతీయ స్థానంలో నిలిచిన జిల్లా

రంగారెడ్డి, మే 15(నమస్తే తెలంగాణ): ఇంటర్‌లో అనుత్తీర్ణులైన వారికోసం ఇంటర్మీడియట్ బోర్డు సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నది. ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు పరీక్షల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నది. సప్లిమెంటరీ ఫలితాల్లోనూ మెరుగైన ఉత్తీర్ణతను సాధించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. అనుత్తీర్ణులంతా ఉత్తీర్ణులయ్యేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

### ఈసారి మెరుగుపడ్డ ఫలితాలు..

గతంతో పోలిస్తే ఈసారి ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరంలో 71.7 శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో 77.63 శాతం ఉత్తీర్ణతను సాధించి జిల్లా తృతీయ స్థానాన్ని దక్కించుకున్నది. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 33,721 మంది బాలికలు హాజరవగా.. 25,879(76.74 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 37,576 మంది హాజరుకాగా..23,516(67.18 శాతం)మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 30,900 మంది బాలికలు హాజరుకాగా..25,204(78 శాతం)మంది ఉత్తీర్ణతను సాధించారు. బాలురు 33,859 మంది హాజరుకాగా.. 25,069(74.04 శాతం)మంది పాస్ అయ్యారు. ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించగా.. నిర్దేశిత రుసుముతో దరఖాస్తు చేసుకున్నారు. త్వరలో ప్రారంభం కానున్న సప్లిమెంటరీ ఫలితాల్లోనూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా అధికారులు ప్రయత్నిస్తున్నారు.

### ఆన్‌లైన్ ద్వారా బోధన..

సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న ప్రభుత్వ కళాశాలలకు చెందిన విద్యార్థులపై ఇంటర్ విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కొనసాగుతుండడంతోపాటు ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో విద్యార్థులకు పాఠ్యాంశాల వారీగా అధ్యాపకులతో ఆన్‌లైన్ బోధన నిర్వహిస్తున్నారు. ఫెయిల్ అయిన సబ్జెక్టులపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. సందేహాలు ఉంటే నివృత్తి చేస్తున్నారు. విద్యార్థులకు సంబంధించి వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయడంతో చాలామంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. నిన్నమొన్నటి వరకు అధ్యాపకులంతా ఎన్నికల విధులను నిర్వర్తించడంతో ఆన్‌లైన్ బోధనకు ఆటంకం కలిగింది. ఎన్నికలు పూర్తవ్వడంతో ఇక నుంచి పకడ్బందీగా బోధన తరగతులను నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సిద్ధమవుతున్నారు.

### ఉత్తమ ఫలితాలు సాధించేందుకే..

ఇంటర్‌లో జిల్లాలో ఈ ఏడాది మంచి ఫలితాలు వచ్చాయి. అదేవిధంగా సప్లిమెంటరీ పరీక్షల్లోనూ ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ఆన్‌లైన్‌లో విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా.. ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. ఎన్నికల వల్ల ఈ ప్రక్రియకు కొంత బ్రేక్ పడింది. ఇక నుంచి పకడ్బందీగా ఆన్‌లైన్ తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. సప్లిమెంటరీ పరీక్షల్లోనూ ఉత్తీర్ణత శాతాన్ని పెంచుతాం.

– శ్రీదేవి, డీఐఈవో, రంగారెడ్డి జిల్లా



# పైసలు రాలే..

- వడ్లు విక్రయించి పదిహేను రోజులైనా అందని డబ్బులు
- పెండింగ్‌లోనే రూ.25.07 కోట్ల చెల్లింపులు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- 2913 మంది రైతుల నుంచి రూ.26.52 కోట్ల విలువైన ధాన్యం సేకరణ



వికారాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): జిల్లాలో యాసంగి సీజన్ వరి ధాన్యం సేకరణ తరువాత డబ్బుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీంతో ధాన్యం విక్రయించిన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు, మూడు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామంటూ ప్రభుత్వం చెబుతున్నా.. ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. ధాన్యం అమ్మి పదిహేను రోజులు దాటినా డబ్బులు రాకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు రూ.26.52 కోట్ల విలువైన ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించిన జిల్లా పౌరసరఫరాల శాఖ.. రూ.1.78 కోట్ల చెల్లింపులు మాత్రమే పూర్తి చేసింది. మిగతా రూ.25.07 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లోనే ఉండడంతో సంబంధిత రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. మరోవైపు యాసంగి సీజన్‌కుగాను ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2203, సాధారణ రకం క్వింటాలుకు రూ.2183 చొప్పున మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తున్నది. నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే ధాన్యం డబ్బులను జమ చేస్తున్నది. జిల్లాలో 84,848 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేయగా.. 1.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు.

### 12,039 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ...

జిల్లాలో మొత్తం 129 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అధికారులు ధాన్యం సేకరిస్తున్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించి 1.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 2913 మంది రైతుల నుంచి రూ.26.52 కోట్లు విలువ చేసే 12,093 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇందులో నుంచి ఇప్పటివరకు 10,199 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు తరలించగా, మిగతా 1894 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాల్సి ఉన్నది. ధాన్యాన్ని నిల్వ చేసేందుకు 40 గోదాంలను సిద్ధం చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు ధాన్యాన్ని తరలించే పనిని జిల్లా యంత్రాంగం నాలుగు ఏజెన్సీలకు అప్పగించింది.

### రెండు రోజుల్లో పూర్తి చేస్తాం..

– పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుగుణ బాయి

జిల్లావ్యాప్తంగా ధాన్యాన్ని విక్రయించే రైతులెవరికీ ఇబ్బందులు కలుగకుండా సత్వరమే చెల్లింపులు జరిగేలా చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న చెల్లింపులను రెండు రోజుల్లోగా పూర్తి చేస్తాం. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ట్యాబ్ ఎంట్రీ చేయకపోవడంతోనే బిల్లుల చెల్లింపు పూర్తి కాలేదు.

## బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో దరఖాస్తుల ఆహ్వానం

**- రంగారెడ్డి కలెక్టర్ శశాంక**



షాబాద్, మే 15: జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి కలెక్టర్ శశాంక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద డే స్కాలర్స్, రెసిడెన్సియల్ పాఠశాలల్లో 1వ తరగతిలో డే స్కాలర్స్‌గా ప్రవేశం కోసం 5 నుంచి 6 సంవత్సరాల లోపు అనగా 01-07-2018 నుంచి 30-06-2019 వరకు పుట్టిన, 5 తరగతిలో రెసిడెన్సియల్ స్కూల్‌లో ప్రవేశం కోసం 9 నుండి 10సంవత్సరాల లోపు అనగా 01-07-2014 నుంచి 30-06-2015 వరకు పుట్టిన షెడ్యూల్డ్ కులాల బాలబాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు రంగారెడ్డి జిల్లా వాస్తవ్యులై ఉండాలన్నారు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు గ్రామీణ ప్రాంతాల్లో, రూ.2లక్షల లోపు పట్టణ ప్రాంతాల వారికి ఉండాలన్నారు. ఒక కుటుంబం నుంచి ఒక విద్యార్థికి మాత్రమే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం ద్వారా డే స్కాలర్, రెసిడెన్సియల్ పాఠశాలల్లో అవకాశం కల్పించబడుతుందన్నారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు మీ సేవ ద్వారా పొంది ఉండాలని చెప్పారు. బాలుర బాలికల పాఠశాలలో ప్రవేశానికి ఫారాలు 18-05-2024 నుంచి 07-06-2024 వరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, రంగారెడ్డి కలెక్టర్ కాంప్లెక్స్ కొంగరకలాన్, ఇబ్రహీంపట్నం మండలంలో లభిస్తాయన్నారు. జిల్లాలో ఎన్నికల కాబడిన పాఠశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. హోలీస్పిరిట్ ఉన్నత పాఠశాల, షాబాద్, ప్రజ్ఞా ఉన్నత పాఠశాల ఆమనగల్లు, బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల ఇబ్రహీంపట్నం, బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల, సరూర్‌నగర్, చంపాపేట్, ఎస్‌వీవీఆర్ కాన్వెంట్ స్కూల్, కందుకూర్, విజేత ఉన్నత పాఠశాల, వెల్జాల్, తలకొండపల్లి మండలం, ప్రగతి ఉన్నత పాఠశాల, కడ్తాల్, న్యు లిటిల్ స్కాలర్స్ ఉన్నత పాఠశాల కిస్మత్‌పూర్, రాజేంద్రనగర్, కేఎన్ఆర్ ఉన్నత పాఠశాల తోల్కట్ట, మొయినాబాద్ మండలం, హయత్‌నగర్ ఉన్నత పాఠశాల, హయత్‌నగర్ రంగారెడ్డి జిల్లాలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను తీసుకొని పరిశీలన కోసం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో పోస్టు ద్వారా గాని, నేరుగా గాని 07-06-2024న సాయంత్రం 5గంటల లోపు అందజేయాలన్నారు. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని పేర్కొన్నారు.



# క్రికెట్ మోజుతో యువత జేబులు గుల్ల

- జోరుగా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు
- సామాజిక మాధ్యమాలే వేదికగా దందా..
- అత్యాశకు పోయి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్న యువత
- బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవు : కేవీపీ రాజు, ఏసీపీ ఇబ్రహీంపట్నం



ఇబ్రహీంపట్నం, మే 15 : ఐపీఎల్ అంటేనే యువతలో మంచి క్రేజ్ ఉన్నది. ఈ రోజుల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ క్రికెట్‌ను ఆసక్తి వీక్షిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు బెట్టింగ్ నిర్వాహకులు అమాయకులతో బెట్టింగ్‌లు పెట్టించి నిండా ముంచుతున్నారు.

రెండు జట్ల మధ్య జరిగే ఆట కాస్త జూదంలా మారిపోయింది. ముఖ్యంగా యువత బెట్టింగ్ మోజులో జేబులు గుల్లా చేసుకుంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులను సంపాదించుకోవచ్చనే దురాలోచనలతో యవకులు విలువైన వస్తువులను తాకట్లు పెట్టి మరీ సర్వం కోల్పోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఐపీఎల్ బెట్టింగ్‌లు చాపకింద నీరులా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు పాకిపోయింది. మ్యాచ్‌ను తిలకిస్తూ, బెట్టింగ్‌లను కాస్తూ మద్యాన్ని సేవించడం ఒక వ్యసనంలా మారుతున్నది.

### సామాజిక మాధ్యమాలే ప్రచారాస్త్రాలు..

ఐపీఎల్ ప్రారంభ దశలో సామాజిక మాధ్యమాలు పెద్దగా అందుబాటులో లేకపోవడంతో యువత బెట్టింగ్‌ల జోలికి వెళ్లేదికాదు. ఐదేండ్లుగా ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్స్ ఉండడం.. ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలు విస్తృతంగా వినియోగంలోకి రావడంతో బెట్టింగ్‌ల జోరుగా సాగుతున్నది. పదిమంది యువతకు కలిపి ఒక వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా ఎవరికీ అనుమానాలు కలుగకుండా బెట్టింగ్‌లను కాస్తూ అప్పులపాలవుతున్నారు.

### గూగుల్‌లో సమాచారం అందుబాటులో..

నూతన అంశాలను తెలుసుకోవడానికి ప్రతి ఒక్కరూ గూగుల్‌ను వినియోగిస్తుంటారు. ఐపీఎల్ బెట్టింగ్‌ను ఎలా వేయాలి.. ఎలాంటి యాప్‌లు అందుబాటులో ఉన్నాయి ఇలా ప్రతి ఒక్కటి గూగుల్‌లో సెర్చ్ చేసి మరీ బెట్టింగ్ వైపు ఆకర్షితులవుతున్నారు. గతంలో ఆట పూర్తి కాగానే అందరూ ఒకే దగ్గరకు చేరుకుని గెలిచిన వాడు ఓడినవాళ్ల దగ్గర డబ్బులను వసూళ్లు చేసుకునేవారు. ప్రస్తుతం ప్రతి ఒక్కటి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రావడంతో డబ్బులను పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే తదితర యాప్‌ల ద్వారా పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయి. బెట్టింగ్ నిర్వాహకులు ప్రధానంగా యువతను టార్గెట్ చేస్తున్నారు. పదిమంది యువకుల్లో ఒకరి చొప్పున నిర్వాహకులు మచ్చిక చేసుకొని పెద్ద ఎత్తున యువతను బెట్టింగ్ దందాలోకి లాగేలా చూస్తున్నారు. సదరు వ్యక్తికి మ్యాచ్ ఓడినా, గెలిచినా ఐదుశాతం చొప్పున కమీషన్ ఇస్తూ అమాయకులను బెట్టింగ్‌లోకి రప్పించేలా ఆ వ్యక్తిని మధ్యవర్తిగా వినియోగించుకుంటున్నారు. ప్రధాన చౌరస్తాలను ఎటువంటి సంచారం లేని వీధులను ఎంపిక చేసుకుని ఈ వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారు.

### యువత పాలిట జూదం..

ఐపీఎల్ బెట్టింగ్ యువత పాలిట జూదంలా మారింది. బెట్టింగ్ కాసే దగ్గర వ్యక్తులు లేనప్పటికీ ఆన్‌లైన్‌లో డబ్బులు పంపిస్తే చాలు, ప్రధాన టీంలకు ఒక రేటు, మామూలు టీంలకు ఒక్క రేటును నిర్వాహకులు ఫిక్స్ చేస్తారు. ప్రధాన టీంలో ప్రతి ఓవరుకు లేదా ప్రతి బ్యాట్‌మెన్ సాధించే పరుగుల మీద, ప్రతి బౌలర్ తీసే వికెట్లపై ఒక్కో రేటును ఫిక్స్‌డ్ చేయడంతో యువత బెట్టింగ్‌ల వైపు ఎక్కువగా ఆసక్తిని కనబరుస్తున్నారు. మొదటి రెండు రోజులు సరదాగా అలవాటైన బెట్టింగ్‌లు జూదంలా మారి ప్రతి ఏడాది ఎక్కడ ఉన్నా ఫోన్‌లలో బెట్టింగ్ వేస్తున్నారు. బెట్టింగ్ కాసే సమయంలో డబ్బులు లేకుంటే ఖాళీ ప్రామిసరీనోట్ మీద సంతకం లేదా బైకులు, మొబైల్స్‌ను పెట్టుకుని రూ.10 మిత్తితో నిర్వాహకులే డబ్బులను ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

### బెట్టింగ్‌ను అరికట్టాలంటే..

ఐపీఎల్ బెట్టింగ్‌లను పూర్తిగా అరికట్టాలంటే విద్యార్థులు, యువకులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిని సారించాలని పోలీసులు సూచిస్తున్నారు. క్రికెట్‌ను ఎక్కువగా ఇష్టపడే వారే దానిపై ఉన్న మోజుతో ఊబిలోకి కూరుకుపోతున్నారని హెచ్చరిస్తున్నారు. మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో పిల్లలు టెన్షన్‌గా ఉండటం, సెల్‌ఫోన్, ల్యాప్‌టప్, కంప్యూటర్ల వినియోగం అధికంగా ఉన్నట్లయితే వారిని ఆరాతీయాలి. అదే విధంగా మనీ ట్రాన్స్‌ఫర్లపై దృష్టి పెట్టాలి, దీని వల్ల బెట్టింగ్ ఊబి నుంచి బయట పడటానికి అధిక అవకాశాలుంటాయని, గ్రామీణ ప్రాంతాల్లోని, పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థులు యువకుల తల్లిదండ్రులు బెట్టింగ్ విషయంలో తమ పిల్లలు కూరుకుపోకుండా జాగ్రత్తలు వహించాలని పోలీసు అధికారులు తెలియజేస్తున్నారు.






### బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవు..

ఐపీఎల్ క్రికెట్ కొనసాగుతున్నందున ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ వేదికగా పెద్ద ఎత్తున బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. ఎక్కడైనా బెట్టింగ్‌లకు పాల్పడినట్లు మా దృష్టికి వస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. ముఖ్యంగా యువత ఈ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి.

– కేవీపీ రాజు, ఏసీపీ ఇబ్రహీంపట్నం